ప్రజాశక్తి

శనివారం 5 అక్టోబర్ 2024   8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

అట్టహాసంగా బూచేపల్లి ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

భారీగానే తరలివచ్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఆయనను అభినందించారు. రాష్ట్ర పార్టీ తరపునే మాజీ మంత్రి పేర్నినాని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చీమకుర్తి నుంచి ర్యాలీగా బయలుదేరిన బూచేపల్లి పట్టణంలో సాయిబాబా గుడిలో పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వద్దకు చేరుకొని జిల్లా నేతలతో కలిసి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. నూతన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడిగా జిల్లా నేతల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అందరూ అభినందించారు. కార్యాలయం కార్యకర్తలు, నేతలతో కిటకిటలాడింది. అక్కడ జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ 2029లో వైసిపిని మళ్లీ అధికారంలోకి తెచ్చేది కార్యకర్తలేనన్నారు. తనలాంటి నాయకులు వస్తుంటారు.. పోతుంటారని, కార్యకర్తలే ఫైనల్ అని చెప్పారు. జగన్ దగ్గర అధికారం లేకపోవచ్చుని, మోసపు మాటలు మాత్రం లేవన్నారు. కొందరు చెబుతున్నట్లుగా ఈవీంఎలను మోడీతో కలిసి మోసం చేసి ఉండవచ్చన్నారు. జగన్ జనాన్ని మోసం చేయడానికి గోధుమరంగు పంచకట్ట లేదని, ఎర్రలుంగీ కట్టలేదని పేర్కొన్నారు. తనకు కులం లేదని మొన్న చెప్పి ఇవాళ కులం ఉంది.. మతం ఉందని డ్రామా మాటలు జగన్ ఏ రోజూ చెప్పలేదన్నారు. చంద్రబాబులా ఎవరి సాయంతోనూ జగన్ అధికారంలోకి రాలేదన్నారు. సింగిల్‌గానే వచ్చారన్నారు. జనానికి మేలు చేయాలనే తపనతో కార్యకర్తలను కూడా పట్టించుకోలేకపోయామని జగన్ కూడా బాధపడుతున్నారని గుర్తుచేశారు. కార్యకర్తల ఇబ్బందులను చూడలేకపోయామన్నారు. కూటమి ప్రభుత్వం వైసిపి కార్యకర్తలను వేధిస్తోందన్నారు. పోలీసుల అండదండలతో వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో ఆరు నెలల తర్వాత వైసిపి కార్యకర్తలు తిరగబడటం మొదలుపెడితే మీరు వెంట్రుక కూడా పీకలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఐదేళ్లు అధికారం అనుభవించి ఎక్కడికైనా వెళ్లేవాళ్లు వెళ్లవచ్చు అని వ్యాఖ్యానించారు. జగన్‌కు వెన్నుపోటు పొడిచే అలవాటు నిజమైన కార్యకర్తలకు ఎవరికీ లేదన్నారు. పార్టీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2029లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఐక్యంగా పనిచేస్తామన్నారు. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు గెలిచేలా పనిచేస్తామన్నారు. పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పూర్వవైభవం తెచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. సభలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి వివిధ నియోజకవర్గాల నుంచి మండలస్థాయి ముఖ్యనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. బూచేపల్లిని అభినందించారు.

పంటను పరిశీలిస్తున్న ఎఒ రంగలక్ష్మి

ఈ-పంట నమోదు తప్పనిసరి: ఎఒ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పెదారికట్ల, వాగుమడుగు గ్రామాల్లోని రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖాధికారి ప్రసన్న రంగలక్ష్మి శుక్రవారం కోరారు. ఈ-పంట నమోదులను విఓఎలు సక్రమంగా నమోదు చేశారా లేదా అని వ్యవసాయ సహాయ సంచాలకులు కె బాలాజీనాయక్ తనిఖీ చేశారు. రైతులు ఈ నెల 7వ తేదీలోగా తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టండి

- ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి

- స్పందించిన దక్షిణ మధ్య రైల్వే జిఎం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి, బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శుక్రవారం విజయవాడ రైల్వే ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో పార్లమెంట్ సభ్యులతో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపి మాగుంట మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఒంగోలు-దొనకొండ కొత్త రైలుమార్గం, కంభం-పోరుమామిళ్ల నూతన రైలు మార్గం ఏర్పాటు చేయాలన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణం సత్వరం పూర్తి చేయాలన్నారు. అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టాలని, రైల్వే ఓవర్ బ్రిడ్జిల లిమిటెడ్ సబ్‌వేల నిర్మాణం జరగాలన్నారు. ముఖ్యంగా ఒంగోలు స్టేషన్ అగ్రహారం గేటు ఎలసి నెంబర్ 207 వద్ద లిమిటెడ్ సబ్‌వే సత్వర నిర్మాణంతో పాటు ఒంగోలులో రైల్వే స్థలంలో ఇళ్లు నిర్మించుకొన్న గుడిసెవాసుల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఒంగోలులో కేరళ ఎక్స్‌ప్రెస్ అయోధ్య- రామేశ్వరం స్పెషల్ ట్రైన్‌తో పాటు టంగుటూరు, సింగరాయకొండ, దొనకొండ, కురిచేడు స్టేషన్‌లలో పలు రైళ్లు నిలపాలని కోరారు. సేతు బంధన్, గతి శక్తి ప్రాజెక్టులలో నిర్మిస్తున్న పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. రైల్వే జనరల్ మేనేజర్, విజయవాడ డివిజనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి అన్ని పనులు పూర్తి చేయటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు సత్య ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

దామచర్ల ఆంజనేయులు వారసుడిగా కొండపి నియోజకవర్గంలోకి ప్రస్తుత మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి అండగా దామచర్ల సత్య రాజకీయ రంగ ప్రవేశం చేశారు. డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిని కొండపి నియోజకవర్గంలో నుంచి దామచర్ల సత్య బాధ్యతలు తీసుకున్న తర్వాత వరస విజయాలతో మూడుసార్లు గెలుపు దిశగా తీసుకెళ్లారు. అలా కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దామచర్ల సత్య, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గం ముందుకు సాగుతోంది. ఇక్కడ పనితీరును మెచ్చుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో దామచర్ల సత్యకు తెలుగుదేశం పార్టీలోని కీలకంగా ఉండే కమిటీల్లో సత్యకు ప్రాధాన్యత ఇచ్చారు. పాదయాత్రలో యువగళం సమావేశాలు, మహానాడు లాంటి కార్యక్రమాల్లో దామచర్ల సత్యకు ఒక స్థానం కల్పించారు. అదే రీతిలో తెలుగుదేశం పార్టీ జోన్లుగా విభజించినప్పుడు ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా దామచర్ల సత్యకు బాధ్యతలు అప్పగించారు. ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా ఉంటూ అక్కడ తెలుగుదేశం పార్టీ విజయంలో కీలక పాత్ర పోషిస్తూనే కొండపి నియోజకవర్గంలో గెలుపులో ముందుకు తీసుకువెళ్లారు. నారా చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్‌కు నమ్మిన వ్యక్తిగా దామచర్ల సత్య నిలబడ్డారు. ఈయన పనితీరును గుర్తించి రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా కీలక బాధ్యతలను అప్పగించారు. శనివారం నాడు మంగళగిరిలో మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా దామచర్ల సత్య బాధ్యతలు స్వీకరించి.. ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి సంబంధించి కొండపి నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు ఇప్పటికే అక్కడికి చేరుకొని భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

చిరు వ్యాపారుల ఉపాధికి చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి నగర పంచాయతీలో రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపులో జీవనోపాధి కోల్పోయిన చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ద్వారా ఉపాధి భద్రత కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. గత నాలుగు రోజులుగా పొదిలి నగర పంచాయతీలో సైడు కాలువ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రోడ్ మార్జిన్ ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. పట్టణంలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా పట్టణ ప్రజలతో పాటు ఆక్రమణదారులు తొలగింపులకు సహకారం అందించారు. ఈ తొలగింపు వలన తోపుడు బండ్లు, బంకులు పెట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులు జీవనోపాధి కోల్పోయి బజారున పడ్డవారి ఉపాధికి మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. రోడ్ మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించి సైడు కాలువలు ప్రొక్లెయిన్‌తో తీసి వెళ్లటానికి దారి వసతి కల్పించకపోవడంతో వేల రూపాయలు అద్దెలు చెల్లించి షాపులు నడుపుకొంటున్న వ్యాపారులు మూత వేసుకోవాల్సిన స్థితి నెలకొన్నది. అలాంటి వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా తక్షణం సైడు కాలువలు నిర్మాణం పూర్తిచేయాలి. మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి. రోడ్ మార్జిన్ ఆక్రమణలతో పాటు పంట కాలువలు, రహదారులు, వాగులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపునకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోకుంటే ఉపాధి కల్పనకు బాధితులతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని అన్నారు.

కురిచేడు ఎంపీడీవోగా విజయశేఖర్

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు ఎంపీడీవోగా పి విజయశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కందుకూరు ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై కురిచేడు మండలానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

వ్యాపారంలో నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి-పామూరు: వ్యాపారంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యత పెంచుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని కందుకూరు కందుకూరు స్టేట్ బ్యాంక్ ఎదురుగా హీరో షోరూం ఏఆర్‌కె మోటార్స్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎల్ఎన్ పురం ఎంపిటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపిపీ గుంటుపల్లి దశరథరామయ్య, షోరూమ్ యజమానులు ఇర్రి కోటిరెడ్డి, సయ్యద్ అమీర్ బాబు, గోళ్ల వీరబాబు, మాజీ సర్పంచ్ మనోహర్, మాల్యాద్రి పాల్గొన్నారు.

సచివాలయాల్లో స్టేషనరీ కొరత

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సచివాలయాలలో స్టేషనరీ కొరత ఏర్పడింది. హై సెక్యూరిటీ పేపర్స్ (వివిధ ధృవ పత్రాలను అచ్చువేసే ప్రభుత్వ రాజముద్ర ఉన్న పేపర్స్) లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉన్న 15 సచివాలయాలలో హై సెక్యూరిటీ పేపర్స్ కొరత ఉంది. ఈ పేపర్స్ జిల్లా అధికారుల నుంచి తెచ్చుకోవాలంటే ఎంపీడీవో సంతకం కావాల్సి ఉంది. మండలంలో ఎంపీడీవో లేకపోవడంతో సమస్య ఏర్పడింది. ప్రస్తుతం విద్యార్థులకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు అవసరమై ఉన్నాయి. రైతులు బ్యాంక్‌లలో లోన్ తీసుకోవాలన్నా, తీసుకున్న లోన్‌లను రెన్యువల్ చేయాలన్నా 1బి, అడంగల్‌లు అవసరమై ఉన్నాయి. సచివాలయాల ద్వారా ఇవి పొందే అవకాశం లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, మీసేవ కేంద్రాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు పొందితే 50 రూపాయలు ఖర్చు అవుతుంది. అదే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు పొందితే రెట్టింపు నగదు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాలకు హై సెక్యూరిటీ పేపర్స్ పంపించి ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు, రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఎస్ఐకి సమస్యలను వివరిస్తున్న సిపిఎం నేత వెంకటేశ్వర్లు

మండలంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆర్ సుమన్‌ను కలిసి కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండలంలో జరిగే పలు సమస్యలపై సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, పలువురు ప్రజాసంఘాల నాయకులు ఎస్ఐ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మండలంలో పలు గ్రామాల్లో జూదం ఎక్కువై పోయిందని, దానికి తోడు అక్రమ మద్యం పెరిగిపోయిందని, వాటిని అరికట్టాలని కోరారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, మద్యం సేవించడం, అల్లర్లు చేయడం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇవి చట్టపరంగా నేరమని, ప్రజల్లో చైతన్యం కలిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లుగానీ, అక్రమ మద్యం విక్రయిస్తూ, అల్లర్లు సృష్టిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు తిరిగి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. ప్రజాసమస్యల కోసం నిరంతరం పోరాటం చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు ఎస్ తిరుపతిరెడ్డి, ఊసా రాజ్యలక్ష్మి, మారం రత్నారెడ్డి, ఇర్ల కొండయ్య, జి ఏసుదాసు, ఏ వెంకటేశ్వర్లు, బి యేసురత్నం, కె థామస్, పి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : Opp.చుండూరు పెట్రోల్ బంక్, అద్దంకి బస్టాండ్, ఒంగోలు.
- బంగ్లారోడ్డు, భాష్యం స్కూల్ దగ్గర, అద్దంకి-523201
- #6/97&98, వార్డు నెం.6, ఎన్టీఆర్ విగ్రహం, నాయుడు వీధి, దోర్నాల బస్టాప్ వద్ద, మార్కాపురం. ఫోన్ : 9492934845
- D.no:2-14-26, Near Chatrapati Sivaji Statue, Devi Theater Road, Kavali -524201, PH No: 9573111796
-S. V. Gopal Reddy complex , YSR Road, Kanigiri – 523230.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-10-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 633.17 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole, AP-523001 నందు వేలం వేయ బడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole ,
AP- 523001 CONTACT PERSON, AREA MANAGER, SIVA PRASAD-87124 44616

ప్రజాశక్తి

శనివారం 5 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఒంగోలులో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

ఉచిత ఇసుక హామీని అమలు చేయాల్సిందే..

4లో

అట్టహాసంగా బూచేపల్లి బాధ్యతల స్వీకరణ

- హాజరైన జడ్పీ ఛైర్‌పర్సన్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు
- 2029లో వైసిపిని తిరిగి అధికారంలోకి తెచ్చేది కార్యకర్తలేనన్న పేర్ని నాని

వైసిపి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న బూచేపల్లి

మాట్లాడుతున్న పేర్ని నాని

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి జిల్లా అధ్యక్షుడిగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం నాడు అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా ఆయన పీఠాన్ని అధిష్టించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. ప్రమాణస్వీకారం కోలాహలంగా జరిగింది. ఎన్నికల తర్వాత నిస్తేజంగా ఉన్న వైసిపి క్యాడర్‌లో కొత్త ఊపు కనిపించింది. దర్శి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల నుంచి ▶ 2లో

నేడు సత్య ప్రమాణ స్వీకారం

భారీగా ఏర్పాట్లు చేస్తున్న టీడీపీ యూత్

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా దామచర్ల సత్యనారాయణ (సత్య) శనివారం నాడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంగళగిరిలోని కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కీర్తిశేషులు, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు కుటుంబం నుంచి రాజకీయ వారసులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముందు రాగా.. ఆ తర్వాత ▶ 2లో

దామచర్ల సత్య

మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

- 7న నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలి
- వామపక్ష నేతల పిలుపు

మెయిన్ 6లో

ఉచిత ఇసుక హామీని అమలు చేయాల్సిందే

- సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్
- ఒంగోలు కలెక్టరేట్ వద్ద, బాపట్లలో సిపిఎం నిరసన

బాపట్లలో కార్మికుల నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల ముందుకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి రమేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక బంగారమైందని అన్నారు. ఎక్కడా దొరకటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం 100రోజులలో రాష్ట్రంలోని ఇసుక నిల్వలన్ని అధికార పార్టీ నాయకులు తీసుకుపోయారని అన్నారు. సామాన్యులకు ఇసుక దొరకక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2500లకు అమ్ముతున్నారన్నారు. ఇసుక దొరకక బిల్డర్లు, గృహ యజామానులు నిర్మాణాలు నిలుపుకోవడంతో కార్మికులు ఉపాధి లేక అల్లాడి పోతున్నారని అన్నారు. రాష్ట్ర గనులు, భూగర్భ జల శాఖ అధికారులు రాష్ట్రంలో 190ఇసుక రీచ్‌లను గుర్తించామని 11లక్షల టన్నుల ఇసుక అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారన్నారు. అధికారులు చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులు చేయవద్దని హితవు పలికారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మాబు, జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీమకుర్తి కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, టంగుటూరు కార్యదర్శి మోజేష్, కొండపి కార్యదర్శి కెజి మస్తాన్ ప్రసంగించారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, పి కల్పన, వి బాలకోటయ్య, బివి రావు, జి శ్రీనివాసులు, బి రఘురామ్, కంకణాల రమాదేవి, తంబి శ్రీనివాసులు, పి సుబ్బారావు పాల్గొన్నారు.

బాపట్ల : ఇసుక సమస్య పరిష్కరించి ఉచిత ఇసుక తక్షణమే సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇసుక సమస్య తీవ్ర రూపం దాల్చడంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతు న్నారని అన్నారు. జిల్లాలో రూ.7200 ట్రాక్టర్ ఇసుక రేటు పలుకుతుందని అన్నారు. దీనివల్ల భవన నిర్మాణాలు ఆగిపోయి కూలీలకు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రతి ఒక్కరికి కార్మిక శాఖ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు కార్మికులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని అన్నారు. ఒక కార్మికుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉంటే పెళ్లి ఖర్చులకు కొంతమేర ఇవ్వాలనే చట్టం అమలుకు నోచుకోవటం లేదన్నారు. ఇదే పద్ధతి అవలంబిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్ కోటేశ్వరరావు, సిపిఎం పట్టణ నాయకులు కె శరత్, భవన నిర్మాణ కార్మిక నాయకులు పాములు, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

రేపల్లె : మాటల్లో గొప్ప చేతల్లో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ ఆరోపించారు. సిపిఎం ఆధ్వర్యంలో ఇసుక సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తహశీల్దారు ఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఇసుక సమస్య వల్ల నిర్మాణ రంగంలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. ధర్నాలో సిపిఎం నాయకులు వై కిషోర్, కె ఆశీర్వాదం, కె గోపి, వి మావో, కె రమేష్, డి అగస్టిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి ధర్మరాజు, నాయకులు చిట్టిబాబు, బాబురావు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రేపల్లె కార్యదర్శి సిహెచ్ మణిలాల్

ధాన్యం సేకరణకు అధికారులు సంసిద్ధం కావాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ధాన్యం సేకరణ ప్రక్రియ నిర్వహించడానికి అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ధాన్యం సేకరణపై అనుబంధ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రవేశపెట్టిందని చెప్పారు. నవంబర్ నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 2.17లక్షల ఎకరాల్లో ధాన్యం సాగు చేస్తున్నట్లు తెలిపారు. సగటున 5.64 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. గతేడాది 29వేల మెట్రిక్ ధర టన్నులు సేకరించామన్నారు. జిల్లాలో కనీసం 50వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించిందని చెప్పారు. జిల్లాలో 57రైస్ మిల్లులు ఉన్నాయని, ధాన్య సేకరణకు క్షేత్రస్థాయి సిబ్బందిని సిద్ధం చేసుకుని శిక్షణ ఇవ్వాలన్నారు. తేమ, బరువు తూచే

వీక్షణ సమావేశంలో కలెక్టర్ జె వెంకట మురళి

యంత్రాలు, 8లక్షల గోనె సంచులు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, పౌర సరఫరాల అధికారి విలియమ్స్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. పరిశ్రమలు, ఎగుమతులపై జిల్లాస్థాయి ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద పరిశ్రమలు స్థాపించే ఔత్సాహితులను ప్రోత్సహించాలని తెలిపారు. గతేడాదిలో స్థాపించిన పరిశ్రమలకు రాయితీ నగదు కొరకు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. గడువులోగా దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేసే ప్రక్రియ శరవేగంగా చేపట్టాలన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో 13 దరఖాస్తులు రాగా ఆయా అనుబంధశాఖల నుంచి గడువులోగా 96దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. మిగిలినవి గడువులోగా పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. మరో ఆరు పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు ఆ శాఖల వద్ద పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. పిఎం ఈజిపి పథకం కింద 135 దరఖాస్తులు రాగా రూ.3.69కోట్ల నిధులు మార్జిన్ మనీ కింద ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశ్వకర్మ పథకం కింద

సమావేశంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

చేతివత్తుల వారి నుంచి 35,138 దరఖాస్తులు వచ్చాయన్నారు. పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిశీలించాలని ఆదేశించారు. సంప్రదాయ వత్తిదారులు జిల్లాలో అధికంగా ఉన్నందున క్షేత్రస్థాయి పరిశీలన విచారణ సమర్ధంగా చేపట్టాలన్నారు. వివిధ ప్రోత్సాహక సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. 350యూనిట్లకు రూ.7.09కోట్ల రాయితీతో పాటు వివిధ ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూ కమిటీ తీర్మాంచినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారి రామకష్ణ, ఎల్‌డిఎం శివకష్ణ, కమిటీ సభ్యులు భక్తవత్సలం పాల్గొన్నారు.

వెలగపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

వెలకట్టలేని వెలగపూడి సేవలు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల పట్టణానికి శోభ కల్పించిన వారిలో పట్టణ ప్రధమ మున్సిపల్ చైర్మన్ వెలగపూడి సుబ్బారావు అగ్ర గణ్యులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయి బాబు అన్నారు. మున్సిపల్ తొలి చైర్మన్ వెలగపూడి సుబ్బారావు 67వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద గల చంద్రకళ పార్కులోని వెలగపూడి సుబ్బారావు విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయమ్మ

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

లింగ నిర్ధారణకు పాల్పడే స్కాన్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ హెచ్చరించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యుల సిఫార్సు లేఖ లేకుండా స్కానింగ్ తీయకూడదని చెప్పారు. డిఐఒ టి వెంకటేశ్వర్లు, డిపిఎంఒ రోహిణి రత్నశ్రీ, ఆర్‌బిఎస్ కెపిఒ సౌజన్య, గైనకాలజిస్ట్ డాక్టర్ శాంతీ వైష్ణవి, జనరల్ ఫిజీషియన్ శ్రీకాంత్, ఎన్జీఒ మహమ్మద్ ఖాన్, ప్రసాదరావు, ప్రచార ప్రతినిధి బి మరియమ్మ, హెచ్ఈ అరుణ పాల్గొన్నారు.

దేవస్థానంలో దామచర్ల సత్య

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - శింగరాయకొండ

రాష్ట్ర మారి టైమ్ బోర్డుగా చైర్మన్‌గా దామచర్ల సత్య శనివారం ప్రమాణ స్వీకారానికి కొండేపి నియోజకవర్గం తోపాటు ప్రకాశం జిల్లా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని పాత శింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంను ఆయన సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అక్కడ చైర్మన్ పామర్తి మాధవరావు కార్యనిర్వహణాధికారి పి కష్ణవేణి ఆధ్వర్యంలో దామచర్ల సత్యకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరిలో జరుగు ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, షేక్ సమాధిభాష, మందలపు గాంధీచౌదరి, ఇమ్మడిశెట్టి రామారావు, షేక్ సనావుల్లా, చిగురుపాటి శేషగిరి, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్క బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

డిపిఒగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) గా కెఎల్ ప్రభాకర రావు శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీల అభివద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు కోసం శక్తి వంచన లేకుండా కషి చేస్తానన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్య వంతమైన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తానని చెప్పారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

డిపిఒ ప్రభాకరరావు

ఆర్డీవోగా అఖిల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చీరాల

రెవిన్యూ డివిజనల్ అధికారిగా దేవరకొండ అఖిల శుక్రవారం భాద్యతలు చేపట్టారు. విశాఖపట్నంలో జాతీయ రహదారి-16స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై చీరాల వచ్చారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది ఆర్డిఒను అభినందించారు.

దేవరకొండ అఖిల

సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

సిఎం సహాయ నిధి మంజూరు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన పత్తిపాటి చైత్రకు (తల సేమియా) ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.10లక్షలకు ఎల్ఓసిని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు శుక్రవారం మార్టూరులోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మార్టూరు మండలం ఇసుక దర్శికి చెందిన అంచ సుబ్బాయమ్మ మోకాళ్ళ ఆపరేషన్ కోసం రూ.2,17,200 అందజేశారు.

నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో

కారుమంచి కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-చీమకుర్తి

నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయుడు నల్లూరి వెంకట శేషయ్య ఆధ్వర్యంలో స్థానిక కారుమంచి మేజర్ కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు శుక్రవారం ప్రారంభించారు. గత ఐదేళ్లుగా కాలువలో పూడిక తీత పనులు, మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టలేదు. దీంతో నీరు సక్రంగా పారుదల కాక కారుమంచి కాలువ క్రింద తాగునీరుకు, సాగునీరుకు రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధుకాన్ గ్రానైట్ వద్ద కాలువ క్వారీలోకి జారిపోవడంతో నీరు అరకొరగా పారుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కారుమంచి కాలువ దిగవనున్న కెవి.పాలెం, ఏలూరువారిపాలెం, భూసురపల్లి గ్రామాల ప్రజలు , రైతులు నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య కలిసి సమస్యను వివరించారు. కాలువలో పూడికతీత పనులు చేపట్టి తమ గ్రామాలకు సాగరు నీరు అందేలా చూడాలని కోరారు. ఐదేళ్లుగా పాలకులు, కాలువలో మరమ్మతు పనులు చేపట్టలేదని తెలిపారు.

పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దీంతో స్పందించిన నల్లూరి వెంకట శేషయ్య కాలువకు మరమ్మతులు పనులు చేపట్టడానికి ముందుకొచ్చారు. నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కారుమంచి కాలువ తూము షట్టర్లు, ఐదు కిలోమీటర్ల మేర కాలువ పూడిక తీత పనులు, జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించారు. ఈ పనులు పది రోజులపాటు సాగనున్నాయి. ఫౌండేషన్ ప్రతినిధులు పాలడుగు వెంకట్ నారాయణ, పుట్ట శ్రీనివాసరావు, గోరంట్ల ప్రసాదు, సర్పంచి బక్క శ్రీనివాస్‌రావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సమ్మిళిత అభివద్ధిపై దష్టి పెట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రజలను ఆమె కోరారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దష్టి సారించిన నేపథ్యంలో ప్రకాశం జిల్లాకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌పై అధికార యంత్రాంగం దష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ప్రకాశం భవనంలోని మీకోసం సమావేశ మందిరంలో పత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా అభివద్ధికి అవసరమైన సూచనలు, సలహాలను ఆమె స్వీకరించారు. విద్య, వైద్యం, కమ్యునికేషన్, పర్యాటకం, నీటిపారుదల, పరిశ్రమలు, మార్కెట్ రంగాలపై ప్రత్యేక దష్టి పెట్టడంతో జిల్లాను సమగ్రంగా అభివద్ధి పరచవచ్చని ప్రతినిధులు తెలిపారు. నీటి పారుదల వ్యవస్థను సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఒ డి. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు వెలువడిన వెంటనే అమలు చేస్తాం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

అంగన్‌వాడీల గౌరవ వేతనం పెంపుదల గురించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, వేతనాల పెంపుదల ఉత్తర్వులు వెలువడిన వెంటనే అమలు చేస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి కె. మాధురి తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 3న హామీలేనా అమలు లేదా అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. వేతనాల పెంపుదల ఉత్తర్వులు వెలువడిన వెంటనే అమలు పరుస్తామని చెప్పారు. అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించేందుకు డైరెక్టరేట్ మహిళా శిశు సంక్షేమ శాఖ గుంటూరులో ఇంటిగ్రేటెడ్ యాప్ ఉండేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న అద్దంకి ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

వేపనూనెతో పురుగు నివారణ

ప్రజాశక్తి - అద్దంకి

రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే పొలంబడి లక్ష్యమని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని కలవకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడిలో ఆయన మాట్లాడారు. వరిలో వచ్చు పురుగులు, తెగుళ్ళు, సూక్ష్మ పోషకాలపై ఛాయా చిత్రాలతో అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో చీడపీడలు తక్కువగా ఉన్నాయని అన్నారు. అనవసరంగా పురుగు మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. అక్కడక్కడ ఆకుచుట్టు పురుగు గమనించినట్లు తెలిపారు. దాని నివారణకు వేపనూనె 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ కోటేశ్వరరావు, విఎఎ మస్తానరావు పాల్గొన్నారు.

ముండ్లమూరు : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసి ఈ క్రాప్ చేయించుకున్న పంటలను ఎఒ ఎండి ఫరూక్ శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. మండలంలోని పులిపాడు, పసుపుగల్లు, పోలవరం గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన కంది, మొక్కజొన్న, మిరప, వరి పంటలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ గ్రామ సహాయకులు నమోదు చేసిన పంటల రికార్డులను, పంటలను సూపర్‌చెక్ చేస్తున్నట్లు తెలిపారు. పంటలు సాగు చేసి ఈ క్రాప్ నమోదు చేసుకోని రైతులు త్వరగా ఆర్‌ఎస్‌కెలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు ద్వారా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి - మార్టూరు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ మార్టూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయం నందు ఈ నెల 6న ఆదివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు తెలిపాడు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, సిఐటియు జిల్లా కార్యాదర్శి సిహెచ్ మంజుందార్, కె రామ కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు, సిపిఎం, ఏచూరి అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

విద్యార్థికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి - మార్టూరు

కళాశాల చదువు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థికి హెల్పింగ్ హాండ్స్ సంస్థ శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక వీరగంధం డిగ్రీ కళాశాల్లో మూడో సంవత్సరం చదువుతున్న షేక్ అబ్దుల్ భాషిత్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ బృందం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరికి రూ.5వేలు ఫీజు నిమిత్తం అందజేశారు. కూలి నాలి చేసుకుంటూ జీవనం గడుపుతున్న కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం అందజేసి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు పఠాన్ ఖాదరవలి, కన్నెగంటి శ్రీను, కె హరిబాబు, పుట్ట అయ్యప్ప స్వామి, జాష్టి సాంబశివరావు పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు గ్రామంలో రూ.90లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంటు నిర్మాణానికి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న మంచినీటి చెరువు వద్ద శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పర్చూరు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివ రావు మాట్లాడారు. గత ఐదేళ్లగా రాష్ట్రంతో పాటు పర్చూరు నియోజకవర్గం కూడా పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. నియోజకవర్గంలోని 95 పంచాయతీల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ లేక ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. రానున్న కాలంలో ప్రతి గ్రామానికి రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తామని చెప్పారు. గ్రామాల్లో మంచినీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించ డానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన దగ్గుబాటి దంపతుల సేవలు అందరూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ వెంకట మురళి అన్నారు. గ్రామం నుండి ఉన్నత స్థానంలో ఉన్న అందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతకు అధికారులు, నాయకులే కాకుండా ప్రజలంతా ముందుకు రావాలని అన్నారు. తమ కర్తవ్యంగా భావించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన సొంత ప్రాంతానికి సొంత గ్రామానికి సేవ చేసుకునేం దుకు తమ కుటుంబం నిత్యం ముందుంటుందని రాజ మండ్రి ఎంపీ, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీరు తాగడం వలన ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని అన్నా రు. ఈ నీటి శుద్ధి చేయటం వల్ల వ్యాధుల నుండి ప్రజలు బయటపడచ్చని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు వచ్చే వ్యాధులు తీవ్ర రూపం దాల్చి ఆసుపత్రుల ఖర్చులు భరించలేని స్థాయిలో పెరిగిపోతున్నాయని అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో మంచినీటి శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తాము నిత్యం ప్రజా సేవ కోసమే పనిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో నిరంతరం విద్యుత్ సౌకర్యం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం మెరుగు పర్చేందుకు పని చేస్తామని చెప్పారు. ఆర్డిఎస్ఎస్ నుండి విద్యుత్తు సౌకర్యం కల్పించడం కోసం గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఇస్తుందని అన్నారు. గ్రామంలో ఏర్పాటు చెయ్యి చేయబోయే తాగు నీటి శుద్ధి కేంద్రానికి రూ.కోటి చెక్కును దగ్గుబాటి తనయుడు చెంచురాం గ్రామానికి అందించారు. కార్యక్రమంలో సర్పంచి బాలిగ శివపార్వతి, రాంకీ సంస్థ ప్రతినిధి రామిరెడ్డి పాల్గొన్నారు.

సభలో ఎంఎల్ఎ ఏలూరి, మంత్రి గొట్టిపాటి, దగ్గుబాటి దంపతులు

అండర్ పాస్ ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జాతీయ రహదారి అధికారులు చేసిన తప్పిదానికి నిత్యం రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఇదంతా మార్టూరు సమీపంలోని డేగరమూడి – రాజుపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై అండర్ పాస్ లేకపోవడంతో రైతులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరికి ప్రజలకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వెంటనే అండర్ పాస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాజుపాలెం, కె రాజుపాలెం గ్రామాల ప్రజలు ఆమెను కోరారు. అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదకరంగా జాతీయరహదారిపై రోడ్డు దాటడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డేగరమూడి – రాజుపాలెం ప్రాంత ప్రజలకు ఈ అండర్ పాస్ చాలా కీలకమని రాజుపాలెం, కే రాజుపాలెం, డేగరమూడీ గ్రామాల ప్రజల వ్యవసాయ భూములు జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్నాయని చెప్పారు. అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ఎఎంసి మాజీ ఛైర్మన్ జాష్టి వెంకటనారాయణ బాబు, తదితరులు వినతి పత్రం అందజేశారు. స్పందించిన పురందేశ్వరి వెంటనే కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి పేషీతోను, జాతీయ రహదారుల అధికారులతోనూ ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నల్లపనేని రామారావు, కె రాజుపాలెం టిడిపి నాయకులు చెరుకూరి నాగేశ్వరరావు, జాష్టి రమేష్ బాబు పాల్గొన్నారు.

పురంధరేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

12 నుంచి నూతన మద్యం దుకాణాలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో 117 మద్యం దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంటా దేవదత్తు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు 12 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకు ప్రైవేట్ రంగంలో మద్యం దుకాణాల కోసం లైసెన్స్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, నగరం, చీరాల, అద్దంకి, పర్చూరుల్లోని ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లలో ధరఖాస్తు తీసుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఒక్కో షాపునకు రూ.2లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డీడీ తీసుకెళ్లి నేరుగా ఎక్సైజ్ స్టేషన్లలో అందజేయవచ్చని తెలిపారు. ఈ నెల 9వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. బాపట్ల జమ్ములపాలెం రోడ్డులో ఉన్న ఎంఎస్ఆర్ కళ్యాణమండపంలో కలెక్టర్ జె వెంకటమురళి నేతత్వంలో ఈ నెల 11న మద్యం షాపులకు లాటరీ తీసి లైసెన్సులు ఇస్తారని తెలిపారు. ఈ నెల 12నుంచి లైసెన్సుదారులు షాపుల్ని ప్రారంభించుకోవచ్చని తెలిపారు. 2011 జనాభా ఆధారంగా చీరాల పట్టణంలో 8, బాపట్లలో 7, అద్దంకిలో 5, రేపల్లేలో 3మద్యం దుకాణాలు వస్తాయి. జిల్లాలో గీత కార్మికుల విభాగంలోకి వచ్చే 6కులాలకు 10శాతం మద్యం షాపుల్ని కేటాయించనున్నారు. దీని ప్రకారం వారికి మరో 11మద్యం షాపులు కేటాయిస్తారు. అయితే గీత కార్మికులకు మద్యం దుకాణాల విషయమై ఇంకా విధివిదానాలు రాలేదని, వచ్చాక ఈ షాపుల విషయమై స్పష్టత వస్తుందని తెలిపారు.

గంటా దేవదత్తు

పొలంలోకి వెళ్లిన దళిత కుటుంబంపై దాడి

ప్రజాశక్తి - శింగరాయకొండ

శానంపూడి గ్రామంలో 530 2బి2లో 5ఎకరాల 24సెంట్లు మామిడి తోట గ్రామానికి చెందిన కూతల నాగేంద్రమ్మ అనే వ్యక్తికి చెంది ఉంది. అయితే ఆ భూమి మొదట నుంచి వాళ్ళ కుటుంబం నుంచే ఈ భూమి సాగు చేసుకుంటూ వస్తున్నారు. శానంపూడి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ భూమి తమ దేనంటూ ఈ దళిత కుటుంబాన్ని పొలంలోనికి రానివ్వకుండా అడ్డుకుంటూ దాడులు చేస్తూ వచ్చారు. కొన్నేళ్ల నుంచి రెవెన్యూ, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేస్తుంటే అధికారులు తమకు ఎందుకంటూ వదిలేశారు. చివరకు శుక్రవారం పొలానికి వెళ్లిన నాగేంద్రమ్మను వాళ్ల సోదరుడు సుబ్బారావుపై శానంపూడి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కత్తులతో వచ్చి దాడి చేశారని, ప్రాణాలను అరి చేతులో పెట్టుకొని అక్కడ నుంచి పరుగులు తీస్తూ రోడ్డు మీదకు వచ్చి 108 వాహనంలో కందుకూరు ఆసుపత్రికి వెళ్లామని బాధితులు చెబుతు న్నారు. కందుకూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తమకు భూమి విషయంలో అధికారులు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

గాయపడ్డ నాగేంద్రమ్మ

గాయపడ్డ సుబ్బారావు

పేటేరు పంచాయతీ కార్యదర్శిగా దాసరి శ్రీనివాసరావు

పేటేరు కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పేటేరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా దాసరి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బేతపూడి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పేటేరు పంచాయతీ కార్యదర్శిగా నియమితుల య్యారు. ఆయనను కార్యదర్శులు అబిద్ హుస్సేన్, దశరధ రామయ్య, సర్పంచి కనపర్తి వసుమతి, వైసిపి గ్రామ ఇన్చార్జి కనపర్తి రవికిరణ్, ఎంపీటీసీ రావు లక్ష్మీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, సురేష్ పాల్గొన్నారు. ఇప్పటివరకు కార్యదర్శిగా పనిచేసిన దాసరి పుష్పకుమారి బేతపూడి కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

దగ్గుబాటి అనుచిత వ్యాఖ్యలు

ప్రజాశక్తి - కారంచేడు

పత్రిక యాజమాన్యులు స్థానికంగా పనిచేసే విలేకరులకు డబ్బులు, జీతాలు ఇవ్వకుండా వసూలు చేసుకోమని వారిని రోడ్లపైకి వదిలారని, అందువల్ల విలేకరులు ప్రజాప్రతినిధుల మీద వివాదాస్పద వార్తలు రాసి వారి దగ్గర నుంచి డబ్బులు దండుకోవడం పరి పాటిగా మారిపోయిందని విలేకర్లపై మాజీ మంత్రి దగ్గు బాటి వెంకటేశ్వరరావు ఆరోపణలు చేశారు. కారంచేడు గ్రామంలో తాగునీటి ప్లాంటు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చీరాల ఎం ఎల్ఎ కొండయ్య సముద్రతీర ప్రాంతాల్లో పర్యాటకుల రక్షణ కోసం గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలనే ఉద్దే శంతో రిసార్ట్స్ యజమానులను వాటికి ఏర్పాటు చేయా లని సూచిస్తే వారివద్ద నుంచి డబ్బులు దండు కుంటు న్నాడని పత్రికల్లో విమర్శలు వచ్చాయంటూ ఉదాహరణ గా చెప్పారు. అలాగే వరద బాధితుల సహా యం నిమిత్తం ఆర్యవైశ్యులను సహాయం చేయమని అడిగితే ఎంఎల్ఎ కొండయ్య కలెక్షన్ ప్రారంభించాడనే విమర్శలు వచ్చాయని, ఇది చాలా బాధాకరమని అన్నారు.

చుక్కీ బైక్ చక్రంలో ఇరుక్కొని..

మహిళ మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా తన కుమారుడికి ఆరోగ్యం బాగో లేకపోవడంతో తన భార్య షేక్ షాకీనాతో కలిసి తన మోటార్‌సైకిల్‌పై నరసరావుపేట వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. మధ్యాహ్న సమయంలో ఏల్చూరు దాటిన తర్వాత జియో పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే షాకినా చున్నీ మోటార్ సైకిల్ వెనుక చక్రానికి చుట్టు కోవడంతో షాకినా ఒక్కసారిగా రోడ్డుపై పడింది. దీంతో షాకీనా (35) అక్కడకక్కడే మృతి చెందారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్పి రామాంజనేయులు

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

స్థానిక పోలీసు స్టేషన్లో రికార్డులను బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. మండలంలో పెండింగులో ఉన్న కేసుల ఫైళ్లను పరిశీలించి రౌడీషీటర్ల వివరాలు, అక్రమ రవాణా తదితర అంశాలపై చర్చించించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దొంగతనాలు అరికట్టేందుకు రాత్రివేళలో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని ఎస్ఐ జివి చౌదరికి సూచించారు. ఆయన వెంట సంతమాగులూరు సిఐ వెంకట్రావు, ఎఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విలేకర్ల సమావేశంలో సిఐ పి కృష్ణయ్య

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో అక్రమంగా గంజాయి అమ్మకాలు ముఠాను అదుపులోకి తీసుకొని వారి వద్ద నిల్వ ఉన్న 1కేజీ 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు సిఐ పీ కృష్ణయ్య తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌పి తుషార్ డూండీ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి పర్యవేక్షణలో స్థానిక ఆర్టీసి బస్టాండ్ వెనుక వైపు ఉన్న హన్విక పెట్ స్పా అండ్ క్లినిక్ షాపుపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. తాళ్లూరు గ్రామానికి చెందిన చేజర్ల ఫణిదర్‌ను పట్టుకొని పట్టణంలోని భవాని సెంటర్‌కు చెందిన దేవరకొండ బాల హరీష్ కృష్ణ, మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన బిల్లా ప్రకాష్, పట్టణంలోని రామనగర్‌కు చెందిన పర్చూరు రాజాచంద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్దనున్న సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకొని ఫోన్ నంబర్ల ఆధారంగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ కేసులో మరో 13మంది నిందితులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఫణిధర్ హన్విక పెట్ స్పా క్లినిక్‌ను నడుపుతూ అదనపు ఆదాయం కోసం వెతుకుతున్నట్లు డి బాల హరీష్ కృష్ణతో పరిచయం ఉండడంతో ఈజీ మనీ కోసం గంజాయి వ్యాపారం చేస్తే అధిక లాభాలు వస్తాయని ఇరువురు కలిసి బిళ్ళ ప్రకాష్ వద్ద కొంత గంజాయి కొనుగోలు చేసి అద్దంకిలో అధిక లాభాలకు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. వారి వద్ద నుండి సుమారు 13 మంది యువకులు వచ్చి కొనుగోలు చేసుకోవడం, తాగుతున్నట్లు తెలిపారు. పర్చూరు రాజా చందు అప్పుడప్పుడు గంజాయిని కొనుగోలు చేసి అమ్ముతున్నట్లు తెలిసిందని తెలిపారు. సమాచారం మేరకు స్పా సెంటర్‌పై దాడులు చేసి స్పా సెంటర్ పక్క గోడలో గంజాయిని ప్లాస్టిక్ బాక్స్‌లో కవర్ల ఉంచి నట్లు గుర్తించి స్వాదీనం చేసుకొని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐలు ఖాదర్ భాషా, సిహెచ్ ప్రవీణ, ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ ఇంటూరి శ్రీనివాసరావు, జి అంకమరావు, పి సాయికృష్ణారెడ్డి, ఎం గోపి, ఎస్ నాగరాజు పాల్గొన్నారు.

నేల బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - పంగులూరు

ఆడుకుంటూ నేల కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన మండలంలోని బూదవాడలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కందుల భాస్కరరెడ్డి, వెంకట రమణమ్మ కుమారులు కందుల మణిశ్రీ బ్రహ్మారెడ్డి (8), కందుల సిద్ధురెడ్డి(6). భాస్కరరెడ్డి రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకొని మరణించారు. అప్పటి నుండి తల్లి వెంకట రమణమ్మ ఆమె పుట్టిల్లు బేతంపూడిలో ఉంటుంది. దసరా పండుగ సందర్భంగా బూదవాడలోని తాతయ్య, నాయనమ్మ అంజిరెడ్డి, విజయలక్ష్మి దగ్గరకు బూదవాడకు బ్రహ్మారెడ్డి, సిద్ధురెడ్డి వచ్చారు. అన్నదమ్ములిద్దరూ ఆడుకుంటూ ఇంటికి 100 మీటర్ల దూరంలోని నేల బావి దగ్గరకు వెళ్ళారు. బావి దగ్గర ఆడుకుంటూ ఆ ఇద్దరిలో ఒకరు కాలు జారి బావిలో పడ్డాడు. వెంటనే రెండవ బాలుడు చూడటానికి వెళ్లి పడ్డాడు. ఇద్దరు పిల్లలు బావిలో పడిన శబ్దం విని చుట్టూ పక్కల వాళ్ళు వచ్చి బావిలో నుండి తీసలపే ఇద్దరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పండుగ కోసమని వచ్చి ఇద్దరు పిల్లలు మరణించడంతో తాతయ్య, నాయనమ్మ తల్లడిల్లి పోతున్నారు. ఇద్దరు పిల్లల మరణవార్త తెలిసి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే రేణింగవరం ఎస్ ఐ వినోద్ బాబు, సిఐ మల్లిఖార్జునరావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

మృతి చెందిన చిన్నారులు

అపరిష్కృత సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రజల అపరిస్కృత సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్, రెవిన్యూ శాఖల అధికారులతో శుక్రవారం మాట్లాడారు. అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్నాయని అన్నారు. గత ఐదేళ్లు వాటి ఊసే లేదని అన్నారు. ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు అధికారులు ముందుకు సాగాలన్నారు. ప్రజలందరూ మెచ్చేలా పనిచేయాలని సూచించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. గ్రామాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పని చేయాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి రహదారి సౌకర్యం ప్రధానమని అన్నారు. అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గ్రామాల్లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీరు అందించేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని అన్నారు. సురక్షితమైన మంచినీరు అందించిలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రధానంగా విద్యుత్ నూతన స్తంభాలు, లైన్లు వేసేలా ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. రెవిన్యూ యంత్రాంగం అపరిస్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రాధాన్య క్రమంలో రైతాంగ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రధానంగా సాగునీటి సమస్య లేకుండా కాలువలు ఆధునికరణ, వరద నీటితో పంటలకు నష్టం వాటిల్లకుండా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీఒ గ్లోరియా, పలువురు రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో అధికారులు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ట్రాన్స్‌పాండర్లతో సులభం కానున్న చేపలవేట

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల క్షేమమే ధ్యేయంగా బోట్లలో ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేయనున్నారు. మరబోట్లలో వేటకు వెళ్ళే మత్స్యకారులు తుపాను లేదా ఇతర కారణాలతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న సమయాల్లో వారిని రక్షించేందుకు వీలుగా వైర్‌లెస్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన పరికరమైన ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లాలో 200వరకు మరబోట్లు ఉండగా వాటిలో 150బోట్ల వరకు ఈ ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి పి సురేష్ తెలిపారు. ఈ పరికరం రేడియో ఫ్రీక్వెన్సీతో పనిచేస్తుందని తెలిపారు. మొబైల్ ఫోన్‌లో ఎలాగైతే టెక్ట్స్ మెసేజ్ చేసుకుంటారో ఇందులో కూడా అదేతరహాలో సమాచారం పంపుకోవచ్చని తెలిపారు. సముద్రంలో ఎంతదూరంలో బోటు ఉన్నా పనిచేస్తుందని తెలిపారు. సదరు బోటుకు ట్రాన్స్‌పాండర్‌ని అమర్చేటపుడు దానిని సమీపంలోని ఫిషింగ్ హార్బర్, మత్స్య శాఖ అధికారులతో అనుసంధానం చేస్తారని తెలిపారు. మర బోటు సముద్రంలో ఎక్కడ ఉందో, ఎంత దూరం తిరిగిందనే సమాచారం కంట్రోల్ సెంటర్, మత్స్య శాఖ అధికారికి చేరుతుందని తెలిపారు. మరబోటుకు ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఆ బోటులోని ఈ పరికరం ద్వారా అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. బోటులో ఇంజన్ రన్నింగ్‌లో ఉన్నంత సేపు ఇది ఆన్‌లోనే ఉంటుందని తెలిపారు. మత్స్యకారులు సముద్రం మధ్యలో బోటును లంగరు వేసిన సమయాల్లో ఈ పరికరం పనిచేయడానికి సోలార్‌తో బ్యాటరీ పనిచేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు.



చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల క్షేమం కోసం ట్రాన్స్‌పాండర్లు

సముద్రంలో చేపలు ఉనికిని తెలియజేస్తుంది

మరబోటులో ఏర్పాటు చేసే ఈ ట్రాన్స్‌పాండర్ ద్వారా సముద్రంలో చేపలు అధికంగా ఏ ప్రాంతంలో ఉన్నాయో తెలుస్తుంది. శాటిలైట్‌గా ద్వారా సముద్రంలో ఎక్కడ చేపలు ఉన్నాయో తెలుసుకుని అక్కడికి మత్స్యకారులు వెళ్ళి వేట సాగించవచ్చు. సాధారణంగా మరబోట్లలో చేపల వేటకు వెళ్ళే మత్స్యకారులు సముద్రంలో రోజుల తరబడి ఉండి చేపలు పడే వరకు వలలు వేస్తూ ఉంటారు. సక్రమంగా వలలో చేపలు పడక వారం నుంచి పది రోజుల వరకు వారు సముద్రంలోనే ఉంటారు. అయితే బోట్లలో ఈ పరికరం ఏర్పాటుతో చేపలు ఎక్కడ ఉన్నాయో తెలుస్తుంది కనుక ఎక్కువ రోజులు సముద్రంలో ఉండే పరిస్థితి ఉండదు.

ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంపీపీ లలిత కుమారి

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన ఎంపిడిఒగా ఎస్‌వి రమణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా పని చేసిన గుమ్మా చంద్రశేఖర్ గుంటూరు జిల్లా పొన్నూరుకు బదిలీ కాగా రమణ కృష్ణాజిల్లా విస్సన్నపేట నుండి భట్టిప్రోలకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు ఎంపీపీ డివి లలిత కుమారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జలజ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, నాయకులు మల్లేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

అద్దంకి : ఎంపిడిఒగా నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బత్తిన సింగయ్య బదలీ అయ్యారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఈఓఆర్డి ఎవిఎస్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిడిఒ శింగయ్య

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుండి 50మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు చెప్పిన వివరాల ప్రకారం నాయనపల్లికి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొంజేటి చేనేతపురి కాలనీలో అక్రమంగా మద్యం నిలవలు ఉంచుకొని వేటపాలెంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

మృతదేహంతో రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి - వేటపాలెం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాల ఆధ్వర్యంలో మృతదేహంతో శుక్రవారం రోడ్డుపై బైఠాయించిన సంఘటన రామన్నపేట పంచాయితీ కొత్తకాలువ ఆర్‌అండ్‌బి రోడ్డుపై బైఠాయించారు. వినాయకపురం గ్రామానికి చెందిన గంట రాజశేఖర్ గురువారం మద్యం సేవించి భార్యతో గొడవపడి ఇంటిలోనికి వెళ్లి గడియ పెట్టుకొని చనిపోయాడు. స్థానికుల సమాచారంతో చీరాల రూరల్ సిఐ పి శేషగిరిరావు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపే క్రమంలో ఒక్కసారిగా రోడ్డుపై మృత దేహంతో ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని దళిత సంఘాల నాయకులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నియంత్రించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రేపల్లె

డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరబోవు విద్యార్థులకు ప్రభుత్వం స్పాట్ అడ్మిషన్ల కొరకు 07నుండి 09వరకు అవకాశం కల్పించిందిని ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టిసి రవిచంద్ర కుమార్ తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు కళాశాల పని వేళల్లో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా సంప్రదించాలని అన్నారు. ఈ అవకాశం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శుభాకాంక్షలు
ప్రజల మెచ్చిన నాయకుడు
కొండపి నియోజకవర్గ ప్రజల ముద్దుబిడ్డగా..
అనునిత్యం శ్రమించే మా యువ నాయకుడు
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య) గారు
నేడు రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ గా
ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా
హార్ధిక శుభాకాంక్షలతో...
దామచర్ల సత్యనారాయణ (సత్య)
రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్, ఉత్తరాంధ్ర జోన్- 1 ఇన్‌ఛార్జ్
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి
కొండపి మండల తెలుగుదేశంపార్టీ
దామచర్ల అభిమానులు, కొండపి - ప్రకాశం జిల్లా

హృదయపూర్వక శుభాకాంక్షలతో....
దామచర్ల కుటుంబం ముద్దుబిడ్డ....
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి
ఉత్తరాంధ్ర ఇన్చార్జ్‌గా సమర్ధవంతంగా పనిచేస్తూ
నేడు రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ ప్రమాణస్వీకారం చేస్తున్న...
శ్రీ దామచర్ల సత్యనారాయణ (సత్య) గారికి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు....
కొత్తూరి శ్రీరంగనాయకులు
శింగరాయకొండ
తాళ్లూరి రమేష్
శింగరాయకొండ
పబ్బిశెట్టి శ్రీనివాసరావు
శింగరాయకొండ
కాసుల రామ్మోహన్
శింగరాయకొండ